రాయితీపై ఆర్గానిక్ సబ్జీ కూలర్స్

- ఉద్యాన శాఖ ద్వారా సరఫరా
- హెచ్‌ఓ కోటేశ్వరరావు

కొత్తపేట: పండ్లు, కూరగాయలు, పువ్వులు తదితర పచ్చి సరకులను చల్లగా ఉంచి, వాటి నిల్వ సామర్థ్యాన్ని పెంచే ఆర్గానిక్ సబ్జీ కూలర్స్ (సేంద్రియ ఉత్పత్తుల ఫ్రిడ్జ్‌లు) ఉద్యాన శాఖ ద్వారా రాయితీపై సరఫరా చేయనున్నట్టు స్థానిక ప్రాంతీయ ఉద్యాన అధికారి (హెచ్‌ఓ) జి.కోటేశ్వరరావు తెలిపారు. బుధవార ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ ఆవిరి ద్వారా పచ్చి సరకుల నిల్వ సామర్థ్యాన్ని పెంచే విధంగా ఒక గొప్ప సాంకేతికతతో 7 అంచుల నిర్మాణం కలిగి రూకర్ట్ సబ్జీ కూలర్‌ను ముంబాయి ఐఐటీ కంపెనీ రూపొందించిందని తెలిపారు. రాష్ట్రంలో ఉద్యాన శాఖ ద్వారా మొదటగా పలుచోట్ల రైతుబజార్లకు, పువ్వుల సాగు చేసే రైతులకు రాయితీపై ఇచ్చి వాటా పనితనాన్ని అధ్యయనం చేయడం జరిగిందని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో తిరుపతి, విజయవాడ, రాజమహేంద్రవరం, విశాఖపట్నంలో రైతు బజార్లకు 8 యూనిట్లు రాయితీపై ఇచ్చినట్టు తెలిపారు. ఈ సబ్జీ కూలర్స్ వినియోగానికి ఇంధనం గాని, ఎలక్ట్రిసిటీ గాని, సౌర విద్యుత్ గాని అవసరం లేదని పేర్కొన్నారు.


ఆర్గానిక్ సబ్జీ కూలర్స్

సద్వినియోగం చేసుకోవాలి

సబ్జీ కూలర్స్ కావలసిన రైతులు పైన సూచించినట్టుగా 50 శాతం రాయితీ పోను మిగిలిన సొమ్మును డీడీ రూపంలో చెల్లిస్తే యూనిట్ అందజేస్తారని తెలిపారు. రైతులు, రైతు బజార్, కూరగాయల మార్కెట్, పూలు, పండ్ల వ్యాపారం చేసుకునే రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు జిల్లా ఉద్యాన అధికారి లేదా, మండల ఉద్యాన అధికారిని, రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించాలని హెచ్‌ఓ కోటేశ్వరరావు కోరారు.

ఒక యూనిట్‌కు సంబంధించి ఖరీదు, రాయితీ వివరాలు ఇలా..

కెపాసిటీ	యూనిట్ ధర	రవాణా చార్జీ	మొత్తం ఖర్చు	50 శాతం రాయితీ
25 కేజీలు	17,700	3,300	21,000	10,500
50 కేజీలు	35,400	4,500	39,900	19,950
100 కేజీలు	50,000	7,000	57,000	28,500

గోదావరి తీరం రక్షణకు చర్యలు చేపట్టాలి


సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణకు నదీకోత సమస్యను వివరిస్తున్న రైతులు

మామిడికుదురు: గోదావరి నదీతీరం వెంబడి రక్షణ చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆయన పాశర్లపూడిలో కోతకు గురవుతున్న వైనతేయ గోదావరి నదీతీర ప్రాంతాన్ని శనివారం పరిశీలించారు. స్థానిక రైతులు తాము నదీ కోతతో తీవ్రంగా నష్టపోతున్నామంటూ రామకృష్ణ వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా నాయకులు వస్తున్నారు. పోతున్నారు తప్ప నదీగర్భంలో కలసిపోతున్న భూముల రక్షణకు ఏ విధమైన చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. నదీతీరంలోని భూములన్నీ సన్న, చిన్నకారు రైతులకు చెందినవని చెప్పారు. ఈ భూములు కోతకు గురికావడం వల్ల పేద రైతులు ఉపాధి కోల్పోయి తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఇప్పటికైనా జటిలమైన ఈ సమస్యపై ప్రభుత్వం స్పందించాలన్నారు. నదీతీరం వెంబడి రివిట్‌మెంట్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గోదావరి నదీతీరం వెంబడి తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై సీఎం చంద్రబాబునాయుడుకు ఉత్తరం రాస్తానని రైతులకు రామకృష్ణ హామీ ఇచ్చారు. ఆయన వెంట సీపీఐ నేత దేవ రాజేంద్రప్రసాద్ తదితరులు ఉన్నారు. సీపీఐ కార్యదర్శి రామకృష్ణను కలిసిన వారిలో రైతులు ఉప్పే శ్రీను, పాలూరి అప్పారావు, త్సవటపల్లి బుల్లబ్బులు, మోకా రాంబాబు తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

సూరన్న ప్రజల హృదయాల్లో నిలిచిపోయారు


అంబాజీపేటలో సూరన్నకు నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు

అంబాజీపేట: చిన్న, సన్నకారు రైతులు, పేద ప్రజల పక్షాన పోరాడి వారి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి నేలపూడి స్టాలిన్‌బాబు అన్నారు. నేలపూడి సూరన్న వర్ధంతి సందర్భంగా శనివారం అంబాజీపేటలో సూరన్న చిత్రపటానికి పలువురు నాయకులు నివాళులర్పించారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్, పార్టీ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్, ఎంపీటీసీల మండల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, కుసుమ శ్రీను పాల్గొన్నారు.

నూకాంబిక జాతరకు శ్రీకారం

ఆలమూరు: కోస్తా జిల్లాల్లో ప్రసిద్ధి చెందిన చింతలూరు నూకాంబిక అమ్మవారి ఉత్సవాలకు శనివారం శ్రీకారం జరిగింది. ఏటా కొత్త అమావాస్య వచ్చే నెల రోజుల ముందు అమ్మవారిని బుట్ట గరగ రూపంలో అలంకరణ చేసి ప్రజలకు దర్శనమివ్వడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగా ఆలయ ఈవో ఉండవల్లి వీర్రాజుచౌదరి ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య అమ్మవారి బుట్టగరగను ఆలయ అర్చకులు నెత్తిన ధరించి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. మార్చి 28న పెద్ద జాగరణ, 29న తీర్థం, 30న ఉగాది పర్వదినాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు దేవదాయశాఖ తెలిపింది. నూకాంబిక అమ్మవారి బుట్ట గరగ రూపంలో పర్యటించిన గ్రామాల్లో పాడిపంటలు, అష్టైశ్వర్యాలు, భోగభాగ్యాలతో అలరించడంతో పాటు ఏవిధమైన అంటు వ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రజలందరూ సుభిక్షంగా ఆరోగ్యంగా ఉంటారని తమ ప్రగాఢ విశ్వాసమని భక్తులు చెబుతుంటారు. ఆలయ కమిటీ మాజీ చైర్మన్ వైట్ల శేషుబాబు, గన్ని చిన్నబ్బు, గన్ని సూరిబాబు పాల్గొన్నారు.

నేటి నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు

మామిడికుదురు: ముస్లింలు అత్యంత పవిత్రంగా నిర్వహించుకునే రంజాన్ ఉపవాస దీక్షలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. రంజాన్ ఉపవాస దీక్షలు శనివారం రాత్రి నెలవంక దర్శనంతో ప్రారంభమయ్యాయి. ఈ దీక్షల్లో భాగంగా 30 రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు పాటిస్తారు. రోజూ ఉదయం తెల్లవారుజామున 4.30 గంటలకు 'సహరి'తో ప్రారంభమయ్యే దీక్షలు సాయంత్రం 6.20 గంటలకు 'ఇఫ్తార్'తో ముగుస్తాయి. రంజాన్ ఉపవాస దీక్షల కోసం మండలంలోని మామిడికుదురు, నగరం, కొమరాడ తదితర గ్రామాల్లోని మసీదులను సుందరంగా అలంకరించారు. విద్యుత్ దీపాల కాంతులతో వాటిని దేదీప్యమానంగా తీర్చిదిద్దారు.

చెత్త సేకరణపై ప్రత్యేక దృష్టి

ఆలమూరు: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో చెత్త సేకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ ఎ.రాజు కోరారు. మండలంలోని సంధిపూడి, పినపళ్ల, పెదపళ్ల, చింతలూరు తదితర గ్రామాల్లో చెత్త సేకరణపై శనివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఆయన స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలసి పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. చెత్త సేకరణపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాబోయే రోజుల్లో అన్ని గ్రామాలను చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని సర్పంచ్‌లకు, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఆయన విజ్ఞప్తి చేశారు. అలాగే సామాజిక పింఛన్ల పంపిణీ చురుగ్గా చేపట్టిన సచివాలయ సిబ్బందిని ఎంపీడీఓ అభినందించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

పి.గన్నవరం: గత నెల 24న నరేంద్రపురంలో తన ఇంటి వద్ద ఫిట్స్ రావడంతో మంచంపై నుంచి కిందపడిన మెల్లం మహాలక్ష్మి (64) అనే వృద్ధుడు కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్టు ఎస్సై బి.శివకృష్ణ తెలిపారు. మహాలక్ష్మి మృతదేహానికి అదే ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. బంధువుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వివరించారు.

నిత్యాన్నదానానికి విరాళం

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి కొత్తపేట మండలం పలివెల గ్రామానికి చెందిన కల్యాణపు హృషిత హర్షిణి తన కుటుంబ సభ్యులతో కలసి రూ.18,906 విరాళంగా శనివారం అందజేశారు. ఈ సొమ్మును దాత ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తికి అందజేశారు. దాతను వేద మంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను ఆలయ సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.


దాత హృషిత హర్షిణికి స్వామి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

ప్రాథమిక దశ నుంచే శాస్త్రీయ పరిజ్ఞానం


కొత్తపేటలో ఉత్తమ సైన్స్ ప్రాజెక్టుల విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న శిల్పి రాజ్‌కుమార్

కొత్తపేట: ప్రాథమిక దశ నుంచే విద్యార్థులు శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ప్రముఖ అంతర్జాతీయ శిల్పి డాక్టర్ డి.రాజ్‌కుమార్ వుడయార్ ఉద్బోధించారు. స్థానిక కాంతిభారతి విద్యాసంస్థల ప్రాంగణంలో రెండో రోజు శనివారం సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శనలో శిల్పి వుడయార్ ముఖ్యఅతిథిగా పాల్గొని తిలకించారు. నర్సరీ నుంచి పదోతరగతి వరకూ దాదాపు ప్రతి విద్యార్థి సైన్స్ ప్రాజెక్టులు తయారుచేయగా 250కి పైగా ప్రాజెక్టులు ప్రదర్శించారు. వాటి గురించి విద్యార్థులు వివరించిన తీరు విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం కరస్పాండెంట్ తోట సత్యవాణి అధ్యక్షతన జరిగిన బహుమతుల ప్రదానోత్సవ సభలో శిల్పి రాజ్‌కుమార్ మాట్లాడుతూ క్రమశిక్షణకు, ఉత్తమ విద్యాబోధనకు మారుపేరైన కాంతిభారతిలో 250కి పైగా సైన్స్ ప్రాజెక్టులు సామాన్య విషయం కాదని, ఈ ఎగ్జిబిషన్ ఒక అద్భుతమని అన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు తోట వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు


మామిడికుదురులో ఇంటర్ పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

ఆలమూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ప్రశాంత వాతావరణంలో ఇంటర్మీడియెట్ ఫస్టియర్ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. సుదీర్ఘ చరిత్ర కలిగిన స్థానిక కళాశాల విద్యార్థులతో పాటు కపిలేశ్వరపురం మండలంలోని అంగరకు చెందిన సిద్ధార్థ జూనియర్ కళాశాల, చెముడులంకకు చెందిన ఈశ్వరీ విద్యాలయం, ఆలమూరులోని ఖండ్రిగకు చెందిన బొబ్బా జయశ్రీ బాలికోన్నత (ప్లస్ టూ) పాఠశాలకు చెందిన 392 మంది విద్యార్థులు ఉన్నారు,. అందులో తొలిరోజు 20 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

అంబాజీపేట: పుల్లేటికుర్రు ఏవీఎస్ జూనియర్ కళాశాలలో శనివారం జరిగిన ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఫస్టియర్ తెలుగు పరీక్షకు జనరల్, ఒకేషనల్ కోర్సులకు సంబంధించి 249 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 205 మంది హాజరయ్యారు. 44 మంది గైర్హాజరయ్యారు. డిపార్ట్‌మెంటల్ అధికారి చీఫ్ సూపరింటెండెంట్‌లు తెలిపారు.

ఇంటర్ పరీక్షకు 30 మంది గైర్హాజరు

మామిడికుదురు: ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. ఇంటర్ పరీక్షలకు మామిడికుదురులో రెండు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, జెడ్పీ హెచ్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. జూనియర్ కళాశాలలో 226 మందికి 205 మంది, జెడ్పీహెచ్ స్కూల్లో 203 మందికి 194 మంది వెరసి 429 మందికి 399 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 30 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు.

రావులపాలెం: ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. మండలంలో రెండు కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షల్లో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 345 మందికి గాను, 299 మంది హాజరయ్యారు. అలాగే సత్యసాయి విద్యాసంస్థల్లో 405 మందికి గాను 382 మంది హాజరైనట్టు ప్రిన్సిపాల్ సూర్యనారాయణ రెడ్డి తెలిపారు.

అయినవిల్లి: ముక్తేశ్వరంలోని నరహరిశెట్టి వెంకట్రావు జూనియర్ ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ పరీక్షలకు 198 మంది గాను 191 మంది విద్యార్థులు హాజరైనట్లు ఆ కళాశాల సూపర్‌వైజర్ సామ్ ఎబెల్ తెలిపారు. ఈ పరీక్షల్లో ముక్తేశ్వరం నరహరిశెట్టి వెంకట్రావు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో పాటు, ఎస్.మూలపాలెం ఎంవీఎం ట్రస్ట్ కళాశాల, ముక్తేశ్వరం వైవీఎస్ అండ్ బీఆర్ఎం, నేదునూరు ప్లస్ టూ కళాశాలకు చెందిన 191 మంది విద్యార్థులు మొదటి రోజు తెలుగు పరీక్షలు రాశారు. ఈ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని డీఓ సత్యనారాయణ తెలిపారు.

టీకాలతో చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం

ఆలమూరు: మండలంలోని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల గ్రామ సచివాలయాల పరిధిలో పరిధిలో ఆరోగ్య సిబ్బంది శనివారం చిన్నారులకు టీకాలు అందజేశారు. వైద్యాధికారులు డి.సువర్ణలాదేవి, డి.సాయికిషోర్ ఆధ్వర్యంలో ఆలమూరు–2, కలవచర్ల, పెదపళ్ల, చొప్పెల్ల, మోదుకూరు, మడికి, జొన్నాడ, నవాబుపేట, మూలస్థాన అగ్రహారం తదితర గ్రామాల్లో అనేక మంది చిన్నారులకు ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ సిబ్బంది టీకాలు వేశారు. ఈ టీకాల ప్రక్రియను ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతికుమార్, హెచ్‌ఈలు బి.సూర్యనారాయణ, ఏవీవీ రాజా అక్కుల, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్ బాలామణి పర్యవేక్షించారు.

అనారోగ్య బాధితుడికి సాయం


సఖినేటిపల్లి సంజీవయ్య కాలనీలో షద్రక్‌కు సాయం చేస్తున్న ప్రముఖులు

సఖినేటిపల్లి: స్థానిక సంజీవయ్య కాలనీలో అనారోగ్యంతో ఉన్న తోటె షద్రక్‌కు స్థానిక యేసు క్రీస్తు కృప సంఘం ద్వారా నిర్వాహకులు శనివారం రూ.10 వేల నగదు సాయం చేశారు. ఈ మేరకు పాస్టర్ నవరత్నం, జి.ఆనందరావు, జి.రాజేష్, ఎన్.శ్యామ్‌సుందర్, తాడి సహదేవ్ చేతుల మీదుగా బాధితుడికిపై సాయం అందజేశారు.

సులభ్ కాంప్లెక్స్‌కు వ్యతిరేకంగా ధర్నా


మలికిపురంలో ఆందోళన చేస్తున్న కళాశాల విద్యార్థులు

మలికిపురం: స్థానిక కళాశాల ఎదురుగా ఆర్అండ్‌బీ రోడ్డు పక్కన సులభ్ కాంప్లెక్స్ నిర్మాణానికి పంచాయతీ చేస్తున్న పనులను కళాశాల విద్యార్థులు అడ్డుకున్నారు. అనంతరం ప్రిన్సిపాల్ నేతృత్వంలో విద్యార్థులు పంచాయతీ వద్దకు చేరుకుని నినాదాలు చేశారు. సులభ్ కాంప్లెక్స్ నిర్మాణం వల్ల దుర్గంధం వస్తుందని, నిర్మాణం నిలిపి వేయాలని కోరారు. స్థానిక ఎస్సై సురేష్ చేరుకుని కాలేజీ స్థలంలో కడితే విద్యార్థులు ఆలోచించాలి కానీ, ఆర్అండ్‌బీ స్థలంలో కడితే మీకు అభ్యంతరమేంటని ప్రశ్నించారు. దీనిపై విచారణ చేస్తామని ఎస్సై పేర్కొన్నారు. కోర్టు ద్వారా తేల్చుకుంటామని కళాశాల సిబ్బంది పేర్కొన్నారు.

వీరవల్లిపాలెంలో డీపీవో పర్యటన

అయినవిల్లి: మండలంలో వీరవల్లిపాలెంలో జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) డి.శాంతాలక్ష్మి శనివారం పర్యటించారు. పారిశుధ్య వారోత్సవాల సందర్భంగా ఉదయం 6 గంటలకు గ్రామంలో పర్యటించారు. సిబ్బందితో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. తప్పనిసరిగా ప్రతిరోజు చెత్త సేకరించాలని, సేకరించిన చెత్తను షెడ్‌కు తీసుకుని వెళ్లి తడి, పొడి చెత్తగా వేరుచేయాలన్నారు. ప్లాస్టిక్‌ను కూడా వేరుగా తగుల బెట్టాలన్నారు. కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని డి.శాంతాలక్ష్మి క్లాప్ మిత్రలకు, పంచాయతీ సిబ్బంది వివరించారు. ప్రతి ఇంటికి వెళ్లి అవగాహన కల్పించాలన్నారు.

హెల్త్ వెల్‌నెస్ సేవలు సంతృప్తికరం

రాజోలు: హెల్త్ వెల్‌నెస్ సెంటర్ (ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం) సేవలు సంతృప్తికరంగా ఉన్నాయని న్యూ ఢిల్లీ జాతీయ నాణ్యత ప్రమాణాలు (ఎన్‌క్యూఏఎస్) సంస్థ సభ్యుల బృందం అన్నారు. శనివారం తాటిపాక పీహెచ్‌సీ పరిధిలోని సోంపల్లి గ్రామంలోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను బృంద సభ్యులు వర్చువల్ విధానంలో తనిఖీలు నిర్వహించారు. క్షేత్రస్థాయిలో హెల్త్ వెల్‌నెస్ సెంటర్ అందిస్తున్న సేవలను క్షుణ్ణంగా పరిశీలించి రికార్డులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ ఫణికిరణ్, డాక్టర్ మానస సుప్రియ, సూపర్‌వైజర్లు ఎం.ఎలిజబెత్, ఎ.సత్యవతి, ఎం.శ్రీనివాస్, బి.జయకుమారి, ఎంఎల్‌హెచ్‌పీ తంబి, కట్టా ప్రసాద్, ఏఎన్ఎం బి.పద్మజ, ఆశ కార్యకర్తలు ఎ.శిరీష, ఎస్.భగవతి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల తీరును నిరసిస్తూ ఆందోళన


రాజోలులో పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు

రాజోలు: తాగునీటి చెరువులో శవమై తేలిన గుమ్మడి కుమారస్వామి (35) కేసును పోలీసులు పట్టించుకోవడం లేదని ఆ యువకుడి కుటుంబ సభ్యులు సోమవారం రాజోలులో నిరసన వ్యక్తం చేశారు. తొలుత రాజోలు ప్రభుత్వాస్పత్రి నుంచి పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. రోడ్డుపై బైఠాయించి పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గత నెల 27న కుమారస్వామి హత్యకు గురికాగా, అతని మృతదేహం తాటిపాక చెరువులో తేలిందని కుటుంబ సభ్యులు అన్నారు. అప్పటి నుంచి ఇంతవరకు పోలీసులు కేసు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. హత్య చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. తన కుమారుడు కుమారస్వామి హైదరాబాద్‌లో ఏసీ వర్క్స్ చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడని, తమకు దిక్కెవరంటూ తల్లి గుమ్మడి వరలక్ష్మి పోలీస్ స్టేషన్ ఎదుట రోధించింది. తనకు న్యాయం జరిగే వరకూ స్టేషన్ నుంచి వెళ్లనంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. రాజోలు సీఐ నరేష్‌కుమార్ ఆందోళనకారులతో చర్చించి కేసు దర్యాప్తు వేగవంతం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

వేంకటేశ్వర ఆలయాల్లో ప్రత్యేక పూజలు


జొన్నాడలో అలంకార భూషితుడైన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసి యున్న శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాలు శనివారం భక్తులతో కిక్కిరిసిపోయాయి. చింతలూరు, సంధిపూడి, గుమ్మిలేరు, నర్సిపూడి, జొన్నాడ గ్రామాల్లోని ఆలయాల ఆవరణలో భక్తులు గోవింద నామస్మరణతో ప్రదక్షిణలు చేస్తూ భక్తిపారవశ్యం చెందారు. ఆయా దేవాలయాల ఆలయ పురోహితులు వేద మంత్రోచ్చారణల మధ్య భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆయా ఆలయాల్లో దేవతామూర్తుల విగ్రహాలను పూల, తులసిమాలలతో అలంకరించిన తీరు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. చింతలూరులోని గోశాలను దర్శించుకున్న భక్తులు గోమాతలకు పూజలను నిర్వహించారు. స్థానిక ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక, భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

నల్లచెరువులో..

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేద పండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. వేదపండితులు స్వామికి తులసి పూజ చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామివారికి పటికబెల్లం తులాభారంగా సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

బాలాజీ సన్నిధిలో భక్తుల కోలాహలం

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి ఆలయం శనివారం భక్తులతో కోలాహలంగా మారింది. తెల్లవారు జామున సుప్రభాత సేవ, తొలి హారతి కార్యక్రమాలను అర్చకులు ఘనంగా నిర్వహించారు. ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో పూజలు చేశారు. పవిత్ర వైనతేయ గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు శ్రీదేవి, భూదేవి సమేతుడైన బాల బాలాజీని దర్శించుకుని మహదానందం పొందారు. స్వామి వారికి ముడుపులు, మొక్కుబడులు చెల్లించారు. స్వామి సన్నిధిలో నిత్యం జరిగే లక్ష్మీ నారాయణ హోమాన్ని దర్శించుకున్నారు. గోశాలను సందర్శించి గోవులకు పూజలు చేశారు. స్వామి వారికి వివిధ సేవల ద్వారా రూ.2,32,192 ఆదాయం వచ్చింది. 4500 మంది స్వామి వారిని దర్శించుకున్నారని, 2,200 మంది అన్న ప్రసాదం స్వీకరించారని ఆలయ ఈఓ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు.

శనైశ్చరునికి తైలాభిషేకాలు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామిని శనివారం భక్తులు దర్శించి, ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు జరిపించారు. శనికి ప్రీతికరమైన శనివారం పురస్కరించుకుని దేవదాయ–ధర్మదాయ శాఖ ఉప కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో భక్తుల పూజలకు ఏర్పాట్లు చేశారు. ముందుగా ప్రాతఃకాల సమయంలో ఆలయ అర్చకులు, వేద పండితులు స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపిన అనంతరం భక్తుల దర్శనానికి అనుమతించారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా భక్తుల పూజలు, తైలాభిషేకాల టికెట్ల ద్వారా దేవస్థానానికి రూ.99,040, అన్నప్రసాదం విరాళాల రూపంలో రూ.19,695తో మొత్తం రూ.1,18,735 ఆదాయం వచ్చినట్టు డీసీ అండ్ ఈఓ సూర్యచక్రధరరావు తెలిపారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు విద్యాసంస్థల వితరణ


ఎస్సై సురేష్‌కు కెమెరాల ఏర్పాటుకు విరాళం అందిస్తున్న యూనియన్ అధ్యక్షుడు రమణారావు

మలికిపురం: మండలంలోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటుకు మండలంలోని ప్రైవేటు విద్యాసంస్థల యూనియన్ తరఫున విరాళం అందించారు. మండల అసోసియేషన్ ఆధ్వర్యంలో విరాళాన్ని మలికిపురం ఎస్సై సురేష్‌కు శనివారం అందించారు. కోనసీమ జిల్లా అప్సా యూనియన్ అధ్యక్షుడు ఎస్‌వీ రమణారావు చేతుల మీదుగా అందించారు. మండల యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

రావులపాలెం: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమం రావులపాలెం, ఆత్రేయపురం మండలాల్లో శనివారం నుంచి ఈ నెల 31 తేదీ వరకూ నిర్వహిస్తున్నట్టు రావులపాలెం ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకుడు ఎస్.ఉమామహేశ్వర రెడ్డి తెలిపారు. ఈ రెండు మండలాల్లో మొత్తం 16 టీంలు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తాయన్నారు. నాలుగు నెలలు నిండిన ప్రతి పశువుకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడం జరుగుతుందన్నారు. ఇదే సమయంలో నాలుగు నెలలు దాటి ఎనిమిది నెలల్లోపు ఆడ దూడలకు బ్రుసులోసిస్ టీకాలు కూడా వేస్తున్నట్టు తెలిపారు. పశు పోషకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


గెద్దాడలో బాలిక జననాన్ని స్వాగతిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు


తొత్తరమూడిలో మొక్క నాటుతున్న అంగన్‌వాడీ వర్కర్లు



జొన్నాడలో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు


పి.గన్నవరంలో నిర్వహిస్తున్న మహిళా దినోత్సవ ర్యాలీ

- ఘనంగా మహిళా దినోత్సవం
- ఒకటి నుంచి 8 వరకూ వారోత్సవాలు

పి.గన్నవరం: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని పి.గన్నవరం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం డీఎస్‌వీ ప్రసాద్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. వారం రోజుల పాటు ఈ వేడుకలు జరుగుతాయని ఆయన వివరించారు. మహిళలు, బాలికల హక్కులను అందరూ కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ర్యాలీ నిర్వహించారు. పాఠశాల అధ్యాపక సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరులో..

ఆలమూరు: నేటి సమకాలీన సమాజంలో బాలురకు దీటుగా బాలికలను ప్రోత్సహించి హక్కులను పరిరక్షించాలని కొత్తపేట ఐసీడీఎస్ సీడీపీఓ అధికారి గజలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ మహిళ వారోత్సవాలను పురస్కరించుకుని ఐసీడీఎస్, మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో మండలంలోని జొన్నాడలో తొలిరోజు శనివారం బాలికల సైకిల్ ర్యాలీ జరిగింది. ఎంఈఓ భమిడిపాటి అప్పాజీ, సూపర్‌వైజర్లు టిఎస్‌వీ నాగలక్ష్మి,, వై.అరుంధతి తదితరులు బాలింతల, గర్భిణుల ఇంటికి వెళ్లి ఇంట్లో ఆడపిల్ల పుడితే లక్ష్మీదేవిగా భావించి అపురూపంగా పెంచాలని విజ్ఞప్తి చేశారు. మహిళలతోనే దేశ ఆర్థిక ప్రగతి, సమగ్రత సాధ్యమవుతుందన్నారు.

అయినవిల్లిలో..

అయినవిల్లి: మండలంలోని ఎస్.మూలపాలెం సెక్టర్ పరిధిలో అంతర్జాతీయ మహిళ దినోత్సవ కార్యక్రమాన్ని అంగన్‌వాడీ సూపర్ వైజర్ రామలక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు. కె.జగన్నాథపురంలో కిశోరి బాలికలతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. తొత్తరమూడిలో గర్భిణులు, బాలింతలు, కిశోరి బాలికలతో మొక్కలు నాటించారు. ఆడపిల్లలకు పుట్టిన రోజు వేడుకలు జరిపారు. పుట్టినరోజు వేడుక సందర్భంగా మొక్కలు నాటారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రామలక్ష్మి మాట్లాడుతూ మార్చి ఒకటి నుంచి ఎనిమిదో తేదీ వరకూ మహిళా దినోత్సవ వారోత్సవాలు జరుపుతామన్నారు.

మామిడికుదురు: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోరి బాలికలతో మొక్కలు నాటించారు. మొగలికుదురు జెడ్పీహెచ్ స్కూల్ సర్కిల్ పరిధిలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. మామిడికుదురు జెడ్పీహెచ్ స్కూల్లో ఆటల పోటీలు జరిగాయి. బాలికల జననాన్ని స్వాగతిస్తూ కార్యక్రమాలు జరిగాయి. గెద్దాడలో మొక్కలు నాటారు. మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎన్.సుబ్బలక్ష్మి, బి.అన్నపూర్ణ, పి.విజయలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మలికిపురంలో..

మలికిపురం: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గుడిమెళ్లంకలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ వైకేడీ రమాదేవి పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. సూపర్‌వైజర్ హైమావతి, ప్రసన్నరాణి, సరోజని పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల బైక్ ర్యాలీ

సఖినేటిపల్లి: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో వారోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఓ వైకేడీ రమాదేవి ఆధ్వర్యంలో మోరిలో ఈ మేరకు అంగన్‌వాడీ కార్యకర్తలు పై కార్యక్రమం చేశారు. అలాగే కిషోర బాలికలతో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ నెలలో పుట్టిన ఆడపిల్లలకు తగిన బహుమతులను ఇచ్చారు. ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.